**కథ**

# శిహోతి

**ఆరోజు కృష్ణ చతుర్దశి! హేమంత ఋతువు కావడంతో చలి గజగజ లాడిస్తున్నది. గాడాంధకారం అలుముకుంది ఆ అడవి ప్రాంతమంతటా!**

"దొరా! ఇక నేను నడవలేను. చీకటిలో దారి తప్పి ఎటువెళుతున్నామో ఏమిటో. ఏ అడవి మృగమైనా వచ్చి మీద పడుతుందేమోనని గుబులుగా వుంది. ఏదైనా చెట్టెక్కి కూర్చుందాం తెల్లవారేవరకు" అలసటతో నడవలేక ఆగి మగని చేయి పట్టుకుంటూ ప్రాధేయపడింది ఆహుకి!

"సరే! అలాగే చేద్దాం! తెల్లవారితే గూడానికి తోవ కనిపించకపోదు!" అంటూ కళ్లు చిట్లించి చుట్టూ చూసాడు. దగ్గరలోనే పెద్ద చెట్టు కనిపించడంతో "పద! దానిమీద ఎక్కి కూర్చుందాం! ఎలాగో గడిపేయాలి ఈ రాత్రి" అన్నాడు కోయదొర ఆహుకుడు!

మేఘావృతమైన ఆకాశంలో మెరుపులు మెరుస్తున్నాయి. ఆ వెలుగులో ఇద్దరూ ఎలాగో చెట్టెక్కి కొమ్మల మధ్య కూర్చున్నారు. చిటపటమని చినుకులు పడసాగాయి.

దోసిలినిండా పట్టిన వాన చినుకులు క్రిందకి విడిచి, అందిన ఆకులు త్రెంపి క్రిందికి విసురుతూన్న భార్య దగ్గరకు జరుగుతూ "ఈ కొమ్మమీద ఇద్దరం ఇలా ఒదిగి దగ్గరగా కూర్చుంటే చలి బాధ తెలియటం లేదు గదూ!" అన్నాడు ఆహుకుడు!

ఆ మాటలకు కిలకిలమని నవ్వుతూ దోసిట్లో నీటిని అతని ముఖం మీద చిలకరించింది ఆహుకి!

కొత్తగా పెళ్లయిన ఆ కోయ దంపతులు అన్యోన్యంగా జీవితం గడుపుతున్నారు అడవి దగ్గరలో వున్న ఒక కోయగూడెంలో!

రోజూ ప్రొద్దున్నే అడవికి వెళ్లి పుట్టతేనె, వెదురుబియ్యాలతో బాటు వేటాడిన మృగాలతో సాయంత్రానికి తిరిగి వచ్చేవాడు ఆహుకుడు.

రుచికరమైన ఆహారం సిద్ధం చేసి తన ప్రేమానురాగాలు కలిపి తినిపించేది ఆహుకి! చిన్న పూరిగుడిసె వాళ్ల పాలిట ప్రణయసౌధం!

ఆ రోజెందుకో భర్త వెంట అడవిలోకి వెళ్లాలని ముచ్చటపడ్డది ఆహుకి.

ఇద్దరూ చెట్టాపట్టాలేసుకుని ప్రొద్దున్నే బయలుదేరారు.

అడవిదుప్పిని బాణాలతో కూల్చిన భర్తను ఉత్సాహపరుస్తూ చప్పట్లు కొట్టి స్వేచ్ఛగా పరుగులు తీసింది పట్టుకోమని కవ్విస్తూ! రంగు రంగుల అడవి పూలను మక్కువపడి కోసుకుంది. అలా ఆడుతూ, పాడుతూ సాయంత్రం వరకు గడిపి గూడానికి తిరిగి వెళ్తూ మాటల్లో పడి త్రోవ తప్పారిద్దరూ!

"నేను రాకపోయుంటే నువ్వు తిన్నగా గూటిని చేరుకునుంటావు. దొరా నా వల్ల ఎంత కష్టం వచ్చింది" అన్నది దిగులు నిండిన గొంతుతో ఆహుకి!

"ఇదే మన గూడనుకుందాం. నువ్వే గుబులు లేకుండా హాయిగా నిద్రపో" అన్నాడు ప్రేమగా ఆహుకుడు.

అతని భుజం మీద తలవాల్చి కాసేపట్లో నిద్రాదేవి ఒడిలోకి జారిపోయింది ఆహుకి! తాను మాత్రం నిద్రపోకుండా ఆకులు తెంపి కిందికి విసురుతూ, కూనిరాగాలు తీస్తూ గడిపేసాడు ఆహుకుడు. ఎప్పుడు తెల్లవారుతుందా అని ఎదురుచూస్తున్న అతని కోసమేనన్నట్లు మబ్బులు చెదిరిపోయి తూర్పున వెలుగు రేకలు కానవచ్చాయి. పక్షుల కిలకిలారావాలతో ప్రకృతి చైతన్యవంతమౌతున్నది.

సూర్యకిరణాలు వెచ్చగా ముఖాన్ని సోకడంతో కళ్లు తెరిచింది ఆహుకి!

"తెల్లవారింది పద వెళదాం!" అంటూ తను దిగి, ఆమె చేయందుకుని కిందికి దింపాడు ఆహుకుడు!

చెట్టు మొదట్లో చిన్నప్రోగులా పడివున్న ఆకులను చూస్తూ "రేయంతా నిద్రకాయడానికి, నా పెట్టను జాగ్రత్తగా చూసుకోవడానికని నేను తెంపిపడేసిన ఆకులు చక్కగా ఎట్లా అమరాయో!" అన్నాడు ఆహుకుడు!

అంతలో గాలికి ఆ ఆకులు కదిలి, సూర్యుని తొలికిరణాలు వాటి మధ్యనుండి దూసుకుపోవడంతో ఏదో తళుక్కుమనడం చూసి ఆకులు పక్కకు జరిపాడు ఆహుకుడు! వాన నీళ్లతో తడిసి, ఆకులతో కప్పబడిన శివలింగమొకటి జ్వాజ్వలమానంగా వెలుగుతూ కనిపించింది.

భార్యాభర్తలిద్దరూ ఆశ్చర్యంగా ఆ లింగం వైపు చూస్తూ వుండిపోయారు కొద్దిసేపటివరకూ!

"మన గూడెం గుడిలో వుండే శివయ్య!" అనుకుంటూ భక్తిగా నమస్కరించారు!

"శివయ్య లింగం ఈ చెట్టు కింద వుండటం వల్లనే మనకే ఆపదా రాలేదు! మనమే తెలియకుండా ఆ స్వామికి పైగా చెట్టెక్కి కూర్చుని, ఆకులు విసిరి పడేసి తప్పిదం చేసాం! మా తప్పుకాయి శివయ్యా! ఇంక నుంచి నిన్ను భక్తితో పూజ చేసుకుంటాం!" అని మొక్కుకున్నారు.

ఆ పరిసరాలంతా శుభ్రం చేసి, దగ్గరలో వున్న నీటి చెలమనుండి నీరు తెచ్చి లింగాన్ని శుభ్రపరిచి, అప్పుడే విచ్చిన పూలను తెచ్చి అలంకరించి తృప్తిగా నిట్టూర్చారు. అడవిలో దొరికిన ఫలాలను, తేనెను నైవేద్యంగా పెట్టి ఆనందంగా గూడెం వైపు సాగిపోయారు కోయదంపతులు.

* * *

ఆరోజు నుండి అడవిలో కనిపించిన శివలింగాన్ని పూజించి, నమస్కరించి రావడం ఆహుకుడి దినచర్యలో ఒక భాగమైంది. ఏరోజుకారోజు తానే పూలతో అలంకరించిందీ, ఏ నైవేద్యం సమర్పించిందీ వచ్చి భార్యతో చెప్పి ఆమెకూ ఆనందం కలిగించేవాడు. గూడెం గుడిలో వుండే శివలింగానికన్నా అడవిలోని శివలింగం అతనికెంతో ఆత్మీయంగా తోచడం, దాన్నే ఆరాధించటం అతని పురాకృత పుణ్యఫలం అయివుండవచ్చు. అందుకే ఆ లింగాన్ని చూసిన నాటి నుండి పరమ భక్తుడై జీవిస్తున్న ఆహుకుని జీవితంలో అనుకోకుండా తటస్థించింది వింత సంఘటన ఒకటి.

* * *

ఆ వేళ పగలంతా సూర్యుని జాడే లేదు. ఆకాశం నల్లని మేఘాలతో కప్పబడిపోయింది. తుపాను రాకకు గుర్తుగా హోరున వీస్తున్నది గాలి.

అంతటి గాలి వానలో గూడా అడవిలోకి వెళ్లి శివలింగాన్ని పూజించి వచ్చాడు ఆహుకుడు. తినడానికి ఏమీ దొరకకపోవడంతో ఉత్త చేతులతో గుడిసె చేరుకున్నాడు. అప్పటికే ఇంట్లో వున్న కొద్దిపాటి బియ్యాన్ని వండి భర్త రాకకోసం ఆదుర్దాగా ఎదురుచూస్తున్నది ఆహుకి!

ఉసూరుమంటూ కూర్చున్న అతని తలను పైటతో తుడిచి "రా దొరా! అన్నం తిందువుగాని!" అన్నది.

"వాన తగ్గేట్లు లేదు. పైగా ఈదరగాలి. గూట్లో దీపం ఎలా రెపరెపలాడుతున్నదో చూడు" అంటూ లేచి దీపం పెద్దది చేసి, గుడిసె తలుపు గట్టిగా మూసివచ్చాడు ఆహూకుడు.

ఆకుల్లో అన్నం, దుంపకూరలు, దొన్నెలో తేనె తీసుకువచ్చింది ఆహుకి!

తినడానికి కూర్చోబోతుండగా తలుపు తట్టిన చప్పుడు కావడంతో ఉలిక్కిపడి-

"ఇంత వర్షంలో ఈ సమయంలో ఎవరు వచ్చి వుంటారు?" అనుకుంటూ వెళ్లి తలుపు తీసాడు ఆహుకుడు.

చలికి గడగడలాడుతూ తడిసిన బట్టలతో నిలబడి వున్నాడొక సాధువు!

"కాస్త లోనికి రానిస్తారా? ఆకలితో, చలితో తట్టుకోలేకుండా వున్నాను" అన్నాడు దీనంగా చూస్తూ.

అతని పరిస్థితికి జాలిపడుతూ లోనికి రానిచ్చాడు ఆహుకుడు! అసలే చిన్న గుడిసె. ఇద్దరికంటే ఎక్కువ మంది వుండటానికి ఇబ్బంది కలుగుతుంది. అయినా

**డా.టి.కళ్యాణీ సచ్చిదానందం**



అతడిని కూర్చోబెట్టి తన కోసం వుంచిన ఆహారం అతని ముందుంచాడు ఆహుకుడు.

క్షణంలో తినడం ముగించి ముంతలోని నీరు గటగట తాగేసాడు సాధువు.

"అబ్బ! కాస్త ప్రాణం కుదుటపడ్డది. అయినా ఈ చీకట్లో, వానలో ఇక ప్రయాణం చేయలేను. ఈ రాత్రి ఇక్కడే పడుకుంటాను మీరేమనుకోకపోతే" అన్నాడు వాళ్లవైపు చూస్తూ.

"అలాగే! పడుకోండి" అన్నాడు ఆహుకుడు వెంటనే.

అతని వైపు ఆందోళనగా చూసింది ఆహుకి. ఇద్దరి కంటే ఎక్కువమంది పడుకునే స్థలం లేదందులో.

అందుకే భర్త ఏం చేయదలిచాడో నన్నట్లు చూసిందత నివైపు.

"మా గూడెంత చిన్నదో చూసారుగా సామీ! ముగ్గు రికి లోన పడుకునే తావు లేదు. అందుకే మీరేమీ అను కోకండి. నేను బయట పడుకుంటాను" అన్నాడు చాప పరుస్తూ ఆహుకుడు.

"దొరా! సామికి తోడుగా నువ్వు పడుకో. నేను బయట పడుకుంటాను" అన్నది ఆహుకి వెంటనే తను లేచి బయటకు వెళ్లడానికి సిద్ధపడుతూ.

"ఊహూ! బయట వాతావరణం బాగులేదు. పైగా అడవి మృగాలేవైనా ఇటువైపు రావచ్చు. అందుకే నీవు లోపలే పడుకో. నేను బయట వుంటాను" అంటూ వారించి తను బయటకు వెళ్లి గుడిసె తలుపు మూసాడు ఆహుకుడు.

"సామీ! మీరు అలసి వున్నారు. పడుకోండి" అన్నది ఆహుకి తానేమూలకు జరుగుతూ.

అంతవరకు మౌనంగా వాళ్ల మాటలు వింటూ వుండిన సాధువు ఆమె వైపు చిరునవ్వుతో చూస్తూ "వయస్సులో వున్న నిన్నిలా పరాయి మగవాని దగ్గర విడిచి నీ భర్త బయటకు వెళ్లడం ఆశ్చర్యం కలిగిస్తు న్నది. నీకేమీ భయం, సంకోచం కలగడం లేదా? అతనూ ఇక్కడే వుండి వుండవచ్చును గదా!" అన్నాడు.

"తప్పు చేసుంటే మన్నించండి స్వామీ! ఈ చిన్న, ఇరుకు స్థలంలో మీకు ఇబ్బంది కలగకుండా చూడా లన్న తలపు తప్ప మరేదీ లేదు నా దొరలో! ఇక నా సంగతంటారా? మీ వంటి సాధువులు, సాములోళ్లు మాకు మా గుడిలో శివయ్యతో సమానం. అటువంట ప్పుడు నాకు భయం, సంకోచం ఎందుకు సామీ! ఏ చింతా లేకుండా నిద్రపోగలను"

అంటూ క్రిందకు ఒరిగి వొత్తిగిల్లి పడుకుంది.

సాధువుమరి మాట్లాడలేదు. చాపమీద పడుకుని గాలికి ఎగిసి పడుతున్న కప్పువైపు చూస్తూ వుండిపో యాడు.

* * *

బయట నిలబడి చుట్టూ చూస్తూ అటు, ఇటు తిరుగుతున్నాడు ఆహుకుడు! కడుపు నకనకలాడు తున్నది ఆకలితో. వాన నీటిని దోసిట్లో పట్టి తాగి ఆకలి బాధను అణచడానికి ప్రయత్నించాడు.

'పాపం! ఆ సామి ఎంత ఆకలితో వచ్చాడో. కడుపునిండా పెట్టడానికి ఈరోజే ఏమీ లేకుండా పోవాలా? ఆ కొద్దిపాటి మెతుకులు అతని ఆకలి ఏం తీర్చి వుంటాయి. పోనీ పడు కోవటానికి కూడా సరైన స్థలం చూపడలేకపో యాడు తను. ఈ వానలో తన భార్య తడవటం ఇష్టం లేక లోపల వుండమన్నందుకు ఏమీ అనుకొని వుండడు గదా!'

మనస్సంతా సమాధానం లేని ప్రశ్నలతో గజి బిజిగా మారడంతో నిలబడటానికి శక్తిలేక నేల మీద ముడుచుకు కూర్చున్నాడు ఆహుకుడు!

అంతలో అతి దగ్గరలో పులిగాండ్రింపు వినిపించ డంతో చటుక్కున లేచి నిలబడ్డాడు. వాన తగ్గు ముఖం పడుతున్నది. మేఘాలు చెదిరి ఆకాశంలో అక్కడక్కడ మిణుకు మిణుకు మంటూ కనబడుతు న్నాయి నక్షత్రాలు కొన్ని. ఆ వెలుగులో తన మీదకు లంఘించబోతున్న పెద్దపులిని చూసి దాని పంజా దెబ్బను తప్పించుకోవడానికి ప్రక్కకు గెంతి దాని మెడను ఒడిసి పట్టాడు గట్టిగా. విడిపించుకుని పంజా విసిరి గోళ్లతో అతని భుజాన్ని తీవ్రంగా గాయపర చింది పులి.

'నా శరీరం పులి ఆకలికి ఆహుతి అయినా ఫరవా లేదు. గుడిసెలో నిద్రిస్తున్న వాళ్లకు ఆపద కలగకుండా చూడు శివయ్యా! నీదే భారం' అనుకున్నాడు ఆహు కుడు తాను పూజించే శివలింగాన్ని మనసులో తలు చుకుంటూ. తనకు సాధ్యమైనంత వరకు పోరాడి, రక్తం ధారలుగా పారుతుంటే శివలింగంపైనే ధ్యానం నిలిపి ప్రాణాలు విడిచాడు.

అతని శరీరాన్ని నోట కరిచి అడవిలోకి లాక్కుపో యింది పులి.

తెగి పడిన ఒక చేయి, రక్తధారలు అక్కడ జరిగిన పోరాటానికి సాక్ష్యంగా నిలిచాయి.

* * *

జాము ప్రొద్దుండగానే రోజులాగే నిద్ర లేచి కూర్చుంది ఆహుకి!

కొద్దిదూరంలో అటు తిరిగి నిద్రిస్తున్న సాధువుకు నిద్రాభంగం కలగకుండా జాగ్రత్తపడుతూ మెల్లగా లేచి బయటకు వచ్చింది.

గుడిసె ముందు కనిపించిన దృశ్యం చూసి కొయ్య బారిపోయిందో క్షణంపాటు. రక్తపుమడుగులో పడి వున్న చేతిని చూసి జరిగిందేమిటో కొద్ది కొద్దిగా అర్థమ వుతుంటే "దొరా!" అంటూ పెద్దగా అరిచి, ఆర్తిగా ఆ చేతినందుకుని గుండెల కదుముకుంటూ "ఎంత పని జరిగింది? పులి బారిపడి నన్నొంటరిదాన్ని చేసి వెళ్లిపోయావా?" అంటూ ఏడవసాగింది.

అప్పటికి లేచి బయటకు వచ్చాడు సాధువు. జరి గింది అర్థమైనట్లుగా ఆమెను సమీపించి "ఊరుకో! ఇప్పుడు ఏడ్చి లాభమేమిటి? పులి వాతపడిన నీ మగడు తిరిగి రాలేడు గదా! ఒంటరిగా ఇక్కడ జీవిం చలేవు ఇకపైన. అందుకే నా వెంట రా!" అన్నాడు.

కళ్లు తుడుచుకుని లేచి ఆయన పాదాలకు నమస్క రించింది ఆహుకి!

"నిజం చెప్పారు సామీ! నా మగడు తిరిగి రాలేడు. అలాగే నేనూ ఒంటరిగా జీవించలేను. అందుకే ఇప్పుడే మీ కళ్లముందరే అగ్నికి నా శరీరాన్ని ఆహుతి చేసి నా దొరను చేరుకుంటాను. నన్ను దీవించండి" అన్నది.

సాధువు ఆశ్చర్యంతో చూస్తుండగా గుడిసె కప్పు వూడ బెరికింది!

లోపల వున్న వస్తువులన్నీ ప్రోగుగా చేసి గడ్డితో కప్పి నిప్పంటించింది. నిప్పురాజుకుని మంటలు లేచాయి. అప్పుడే ఉదయిస్తున్న సూర్య భగవానుడు సాక్షిగా చూస్తుండగా చెంగున మంటల్లోకి దూకి ఆహుతైపో యింది కోయవనిత ఆహుకి!

ఆకాశాన్నంటేలా లేచిన మంటలు శాంతించాయి! మసి అంటని బంగారు పుష్పంలా కాంతులీనుతూ బయటకు వచ్చింది ఆహుకి!

ఆశ్చర్యంగా తన వైపు చూసుకుంటున్న ఆమె ఆశ్చ ర్యాన్ని రెట్టింపు చేస్తూ ఆమె ప్రక్కనే నిలిచాడు ఆహు కుడు! అతని శరీరం మీద పులిపంజా దెబ్బలేవీ కాన రావడం లేదు. ఇద్దరూ ఒకరినొకరు చూసుకున్నారు ఆశ్చర్యానందాలతో. ఆ క్షణంలో వారి పూజలు ఫలిం చాయి. వారు చేసిన పుణ్యఫలంగా సాక్షాత్కరించారు పార్వతీపరమేశ్వరులు.

"కోయదంపతులారా! మీ నిర్మలమైన భక్తి, గృహస్థ ధర్మ నిర్వహణ మాకెంతో సంతోషాన్ని కలిగించాయి. మారేడు చెట్టుక్రింద నిక్షిప్తమై వున్న నా లింగాన్ని ఎంతో భక్తిశ్రద్ధలతో పూజిస్తున్న మిమ్మల్ని పరీక్షించడా నికే నేను సాధువు రూపంలో, పార్వతీదేవి పులి రూపంలో రావడం జరిగింది. మీ ఇద్దరికీ ఒకరిపై మరొ కరికున్న విశ్వాసం, ప్రేమానురాగాలు నిజమైన దాంపత్య జీవితానికి నిర్వచనం చెబుతున్నాయి. ఆద ర్శదంపతులుగా మీ జంట కీర్తింపబడుతుంది. ఈ జన్మలో సుఖభోగాలకు దూరమైనా మరుజన్మలో సూర్యవంశంలో చక్రవర్తిగా జన్మించి సమస్త భోగాలను అనుభవించగలవు. ఆహుకి ఉత్తమ రాజకన్యగా జన్మించి నిన్ను చేపట్టగ లదు. ఇకపై ఏ ఆపదలకు గురికాకుండా సుఖశాంతులతో జీవించండి" అంటూ ఆశీ ర్వదించి అంతర్ధానం చెందారు.

"ఆ ఆది దంపతుల దర్శన భాగ్యం కలి గింది. మన జన్మలు ధన్యమైనాయి!" అను కుంటూ భక్తిపారవశ్యంతో పులకించిపో యారు కోయదంపతులు!

